
# రైట్స్ ఆఫ్ అడ్మిషన్




నేను త్రాగడానికి అలవాటుపడ్డాను. మూడు పూటలు సంధ్యావందనము, నాలుగు పూటలు పూజా పునస్కారాలు చేస్తూ సద్బ్రాహ్మణులనిపించుకున్న పరమ వైదిక కుటుంబములో పుట్టిన నేను త్రాగడానికి అలవాటు పడ్డాను.

అలవాటు!....దీని దుంపతెగ! ఇది నియంత. ఆ రాజ్యంలో దీనికత్తి కెదురుండదు. పౌరసత్వపు హక్కు పొందిన వాడల్లా బానిసగా బ్రతకవలసిందే. ఆ బ్రతుక్కు అతడు కించపడడు. వంచన జరుగుతున్నదని ఆలోచించడు. అధనా ఎవరైనా ప్రశ్నిస్తే, ఈ రాజ్యంలో అడుగుపెట్టి చూడు! నీకే తెలుస్తుంది' అని హెచ్చరిస్తాడు. నేనూ మనిషినే. అందుకే అలవాటు అనే ఈ అందమైన పదానికి ఆహుతినయ్యాను.

ఆ మధ్య నేనొక స్నేహితుడింటికి వెళ్ళాను. మనుష్యులంతా ఒకటే నని, జాతులూ....గీతులూ జాన్తానై అని గొంతెత్తి ఘోషించే ఈ రోజుల్లోకూడా ఆ భ్రాంతిని వీడని ఛాందసుడతగాడు. నాకు నమ్మకం లేని అతని పరిభాషలో చెప్పాలంటే అతడు శూద్రుడు — నేను బ్రాహ్మణుడిని. అందుకే అతడు నన్ను చూస్తూనే ఎగిరిపడి లేచాడు. తన అర్ధాంగిని రమ్మన్నాడు. అతని మాటలను శిరసావహించి వచ్చిన విధేయురాలికి నన్నొక కవిగా పరిచయం చేశాడు. ఆ పిదప సతీసమేతంగా పాదములంటి ప్రణమిల్లాడు. ఆశీర్వాదాలపైన నమ్మకం లేకపోయినను ఆశీర్వదించాను, బ్రాందీ కంపు నోటితోనే. భర్త బ్రాందీ కంపు తెలిసి సహించాడు. భార్యకు ఆ కంపు సొంపు తెలియక సహించింది. నా ఆశీర్వాదంతో ఇద్దరూ పొంగిపోయారు. చేయి పైకెత్తడం వరకే పరిమితమైన నా ఆశీర్వాద బలం వారికే తెలియాలి మరి.

'ఆ తాగుబోతుకు పడి పడి దణ్ణం పెడుతున్నారే! మీకేమయినా పిచ్చి పట్టిందా? రామ రామ! మొన్న ఆ బడి దగ్గర గుడ్డలు వీడిపోయేది కూడా తెలియకుండా....'

పధ్నాలుగేళ్ళ పిల్లవాడి నోరాడితే, నా స్నేహితుడి చెయ్యాడింది. ఆ లేత కుర్రవాడి నునులేతబుగ్గ పాపం కందిపోయింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"నోటి కొచ్చినట్లు కూయడమేనా? పెద్దంతరం—చిన్నంతరం వుండక్కర్లా? కవిని దూషిస్తున్నావా? ఛీ: బుద్ధిహీనుడా పో అవతలకి."

నా స్నేహితుడు రొప్పుతున్నాడు. ఎటూ మాట్లాడలేక మధ్య అతని సతీమణి నలిగిపోతూంది. ఆమె దీన దృక్కులే ఆమె పడుతున్న ఆవేదనను వ్యక్తం చేస్తున్నాయి. 'ఇంత జరగడానికి కారకుడవు నీవు కదా!' అని అడుగుతున్నాయి. చూపులకు అర్థమంటూ వుంటే, ఆ అర్థం నాకు అవగతమయింది. తలవంచుకుని వెళ్ళిపోతున్న పిల్లవాడిని పట్టుకుని నిలిపాను.

శిరస్సును ఆప్యాయంగా స్పృశిస్తున్న నా ఎడమచేయి కందిన బుగ్గమీదకు మెల్లగా జారింది. రెండు కన్నీటిబొట్లు నా చేతిమీద ముత్యాల్లాపడి చెదరి నాలోనే ఇంకిపోయాయి.

"ఏడవకు నాయనా! మీ నాన్నకే బుద్ధిలేదు. నీవు బుద్ధిమంతుడివి. నిజంగా చాల గొప్పవాడివవుతావు అని అన్నాను." కుర్రవాడు అదోక రకంగా చూశాడు నావైపు. వంచిన తలను ఒక ప్రక్కకు త్రిప్పి కను రెప్పలు మాత్రం పైకెత్తి ఆ రెప్పలమాటుగా అదోరకంగా చూశాడు నా వైపు. 'ఈ తాగుబోతు మాటలకు అర్థముందా?' అన్న భావన ఆ చూపుల్లో మిళితమై వుంది. నా స్నేహితుడు, వాడి భార్య ఇద్దరూ ముద్దాయిల్లా నిల బడిపోయారు. కొడుకుచేసిన చేతకు క్షమాపణ చెప్పుకోలేని తపన వాళ్ళది. నేను పిల్లవాడిని సముదాయించాలనిగాని, తపనపడుతూన్న తల్లిని మెప్పించా లనిగాని ఆ కుర్రాడి భవిష్యత్తుపై నమ్మకం చూపలేను. త్రాగినమత్తు అసలే కాదు. నిజంగా నాభినుండి వెలువడ్డ మాటలవి. అందుకు కారణమూ లేక పోలేదు. ముప్పైఏళ్ళకు ముందటిమాట. అంటే అప్పుడు నేను ఆ పిల్ల వాడంత వున్నానన్నమాట!

నేను ముందే మనవి చేసుకున్నాను, నిష్ఠాగరిష్ఠుడయిన శ్రద్బ్రాహ్మ ణుడి కడుపున చెడబుట్టిన లబ్ధప్రతిష్ఠుడినని. ఎందుకో తెలియదుకాని ఆ లేత వయసులోనే లెక్కలేనన్ని ఆలోచనలు నన్ను తికమక పెట్టేవి. జీర్ణించుకు పోయిన అలవాట్లను సంప్రదాయమంటే దానికి ఎదురీదే మనస్తత్వాన్ని విప్లవ మనవచ్చు! తల్లి పొదుగుకోసం తపించే లేగదూడలా మనస్సు గింజు లాడేది విప్లవంవైపు. చెబితే తంతారు. చెప్పకపోతే తపన. ఈ ద్వైధీ భావనలో ఎటూ తోచకుండా తిరుగుతున్న రోజులవి. అప్పుడు జంధ్యాల పండుగ వచ్చింది. అప్పటికే నాకు ఉపనయనాదులు జరిపించి. యజ్ఞోప వీతాన్ని తగిలించారు. గాయత్రి నేర్పించి మూడువేళలా జపించమన్నారు. ఎందుకని అడగనూలేదు. చెప్పారని చేయనూలేదు. గుడ్డ ముసుగువేసుకుని

పురోహితుడి సమక్షంలో చెవిలో చెవిపెట్టి తండ్రి చెవిలో వూదిన గాయత్రీ మంత్ర రహస్యం రహస్యంగానే ఉండిపోయింది. అందుకే ఆ పండుగనాడు కూడా ఎక్కడెక్కడో తిరిగి వేళ తప్పి ఇంటికి వచ్చాను.

'ముఖాన తీర్చిదిద్దినట్లు మూడు విభూతిరేఖలు, పసుపు మరకలతో క్రొత్త జంధ్యము, సరిక్రొత్త బట్టలు—చూడ ముచ్చటగావున్నాడే నాన్న?' అనుకుంటుండగానే నా మీద విరుచుక పడ్డాడు. 'ఛీ! అప్రాచ్యుడా! నీకెందుకురా! జంధ్యం?!'-మాట చెవినిబడిందో లేదో ఆ మాటకోసమే కాచుకు కూర్చున్న వాడిలాగా 'నిజమే నాన్నా! నాకెందుకు ఈ బంధం?' అని అంటూ పుటుక్కున తెంపాను జంధ్యాన్ని. ఈ జగడానికి సాక్షీభూతంగా అర మోడ్పు కన్నులతో గడపముందర నిలబడి వుందొక కుక్క. బహుశా దానికిగూడా పండుగని తెలిసే వచ్చిందేమో? చెమటతో మాగి, పొగచూరిన ఇంట్లో ఉట్టికి కట్టిన దారంలాగా వున్న జంధ్యం తునకలై చేతిలో వుంది. ఏమాత్రం సంకోచించకుండా ఆ కుక్కమెడలో వేశాను. ఆ దృశ్యాన్ని భరించలేక నాన్న రెచ్చిపోయాడు. కొట్టిన దెబ్బతో వీధిలో పడ్డాను. తనువు ఏడ్చింది. మనస్సు సంతోషించిండి. అంతే! మళ్ళీ నేనా ఇంటిలో అడుగుపెట్టలేదు. కానీ నేను అడుగుపెట్టిన ఇండ్లన్నీ నన్ను కవిగా గౌరవిస్తూనే వున్నాయి. అందుకే నదురూ....బెదురులేకుండా వాస్తవాన్ని పలికిన ఆ పధ్నాలుగేళ్ళ కుర్రవాడి మీద నాకు అమితమైన గౌరవం ఏర్పడింది. వాడి భవిష్యత్తుపై నమ్మకం కుదిరింది. అసలు ఈ నమ్మకమే నన్ను ఈ స్థితికి తీసుకువచ్చింది. నమ్మిన సిద్ధాంతాన్నిగాని, నమ్మిన వ్యక్తిని గాని తెలిసి నట్టేట ముంచడం నావల్ల గాదు. ఆ కోవకు చెందిన వాళ్ళంటే నాకు గిట్టదు కూడా.

త్రాగుడు నన్ను చెడిపిందనీ, బ్రాహ్మణత్వ సుధామృతానికి నేనొక ఉప్పుకల్లుగా పరిణమించాననీ, పరమ నైష్ఠికుడైన బ్రాహ్మడి కడుపున చెడబుట్టాననీ, నెత్తిన పెట్టుకుని పూజించవలసిన కవి చెత్తలాగ చూడబడు

తున్నానసీ, దీనికంతకూ కారణం త్రాగుడేనని నిప్పులాంటి ద్రవపదార్థాన్ని దెప్పే యీ మనుష్యులకంటే ఆ ద్రవపదార్థంమీదనే నాకు గౌరవం ఎక్కువ: ఈ మనుష్యులనబడే వాళ్ళందరూ ఒకటి చెబుతారు. మరొకటి చేస్తారు. నమ్మించి గొంతులు కోస్తారు. నయవంచకపు బురఖాను తొడుక్కుంటారు. కానీ నేను వాడుతున్న హైక్లాస్ విస్కీకానీ, లోక్లాస్ నాటుసారా కానీ ఎప్పుడూ నమ్మక ద్రోహం చేయలేదు. ఈ మనుష్యుల్లాగ ఒకటి చెప్పి మరొకటి చేయలేదు. 'ఇదో! నిన్ను నేనావహిస్తున్నాను. నీ బాధలకు, వ్యథలకు దూరాతి దూరంగా నిన్ను తీసుకుపోతాను. ఆనందాన్నందిస్తున్నాను!' అని అంటుంది. అన్నంత పనిచేస్తుంది. అటు తర్వాతకూడ, 'ఇదో నేను వెళ్ళుతున్నాను!' అని చెప్పి వెళ్ళిపోతుంది, నా తిప్పలు నాకు వదలిపెట్టి. ఈ మాత్రం యింగిత జ్ఞానంతో ప్రవర్తించే మనిషి నాకెప్పుడూ తటస్థపడలేదు, నా అర్ధాంగిని తప్పించి. అందుకే వాళ్ళిద్దరిమీద నాకు ఎనలేని గౌరవం.

ఈ యిద్దరిలో నా అర్ధాంగి నన్ను నమ్ముకుంది. నేను త్రాగుణ్ణి నమ్ముకున్నాను. దీనికంతకూ కారణం నా అర్ధాంగి!

ఆమె శ్రీమంతుల యింట్లో పుట్టింది. చీకు చింతా లేకుండా పెరిగింది. ఊహా లోకాల్లో ఉవ్విళ్ళూరుతూ బ్రతికింది. ఒక సభలో నా కవిత వినింది. మరొక సభలో నా ఉపన్యాస విన్యాసం చవి చూచింది. నన్ను నమ్ముకుని నా వెంట వచ్చేసింది. నా వెంట రమ్మని నేనామెను పూరించనూ లేదు. వస్తానంటే వద్దని వారించనూ లేదు. తనంతట తానుగా వచ్చింది. ఈ గాలి పటానికి సూత్రం కట్టడానికి ప్రయత్నించింది. అంతకు మునుపు పెట్టినచోట అంత తిని, తిన్నచోట పడుకుని, పడుకున్నచోట నాలుగు పద్యా లల్లుకోవడం—తెగిన గాలిపటంలాగ సాగింది బ్రతుకు. ఇప్పుడు నాకొక తోడు. మా యిద్దరికి కావలసి వచ్చిందొక గూడు. మిట్ట పల్లాలతో, వంకలు వాగులతో, రాళ్ళు రప్పలతో, చీకి పొదలతో నిండిపోయిన ఈ నేలమీద గూడు

దొరకడమంటే మాటలా? ఆ గూట్లో నాతో యిమడడానికి ఎంతో ప్రయత్నించింది నా అర్ధాంగి. కవిత్వమనే అందమైన పదాల కూర్పు ఈ దేశంలో కడుపుకు కూడు పెట్టదని, కావలసిన కనీస సౌకర్యాలను కూడా కల్పించజాలదని తెలుసుకున్నపుడు ఆమె పరిస్థితి తలక్రిందులయింది. ఆమె బంగారు పంజరంలో చిలుక అనుకుంటే — ఆ చిలుకల కొలికి నాపై కినుక వహించింది. సూర్యకాంతికి నిగనిగలాడే నీళ్ళలో మిలమిల మెరుస్తూ ఈదులాడే మీను ఆ మీనాక్షి అనుకుంటే — నీటి బయట చేప అయింది.

రాజ సందర్శనార్థం శ్రీనాథ మహాకవి బయలుదేరాడట! తిరిగి తిరిగి అలిసిపోయాడు. తల మాసింది. వలువలు మాశాయి. 'శ్రీనాథుడేనా?' అన్నంత సందేహం కలిగే తీరులో తయారయ్యాడు మనిషి. అప్పటికీ పట్టు వదలకుండా తిరుగుతున్నాడు. ఆ సమయంలో అతనికొక గాడిద ఎదురయిందట. ఎక్కడ బూడిద బురదల్లో పొరలాడిందో తెలియదు కానీ, తనకు సాదృశంగా కనుపించిందట ఆ ఆకారంలో ఆ గాడిద! 'కొంపదీసి ఈ దేశంలో నువ్వుకూడ కవివా?' అని ప్రశ్నించాడట ఆ కవిసార్వభౌముడు. ఆ కాలంలో కవిసార్వభౌముడడిగితే గాడిద బదులు చెప్పలేదు. కాలం మారింది. కుత్తుకబంటి స్వార్థం, కుళ్ళు కుత్సితాలలో కూరుకుపోయిన మీరు మనుష్యులేనా? అని మనుష్యుల్ని గాడిదలు అడుగుతున్న రోజులివి! అయితే నన్ను మాత్రం ఒక మనిషే అడిగాడు. ఆ మనిషి నా మిత్రుడని చెప్పలేను. కాదని చెప్పలేను. అసలు మనిషి అవునో కాదో కూడ చెప్పలేను. అడిగినదానికి బదులు మాత్రం చెప్పాను. నాకు మానసిక ప్రశాంతత కావాలని బదులు చెప్పాను. 'అయితే నాతో రా!' అన్నాడు. వెళ్ళాను.

అందమైన బంగళాలో ప్రత్యేకించి వున్నట్టున్న గదిలో కూర్చోబెట్టాడు. అమర్చి పెట్టినట్లు అందంగా వుందా గది. టేబిలు మీద రెండు గ్లాసులు పెట్టాడు. రిఫ్రిజిరేటర్‌లో నుండి ఒక బాటిల్ తీశాడు. చూరులో నుండి కారిన వాన నీళ్ళలాంటి ద్రవపదార్థముందా సీసాలో. కొలత కొలిచి

నట్లు రెండు గ్లాసుల్లో పోశాడు. అందులో సోడా కలిపాడు. ఒక గ్లాసు తాను తీసుకుంటూ, నన్నొకటి తీసుకోమన్నాడు. తీసుకున్నాను. 'ఛీర్స్' అని తన గ్లాసును నా గ్లాసుకు తాకించి నోటి కంటించుకున్నాడు. నేనూ అదే పని చేశాను దేబరిస్తూ!

కాఫీ దొరకని పల్లెటూళ్ళల్లో కాపు పడుచు చేతి చిట్టుడుకు నీళ్ళ చవి చూచాను. చిన్నప్పుడు అమ్మ ముక్కు పట్టుకుని త్రాగించిన చిరుచేదు మందు రుచి నెరిగి వున్నాను. ఈ రుచి మాత్రం క్రొత్త! కుంకుడు కాయల రసం మింగినట్లుంది.

గుటగుట తాగేస్తుంటే, 'స్లో'గా 'సిప్' చేయమని ఆదేశించాడు. త్రాగేటప్పుడు గొంతులో కాస్త మంటగా తోచినా, ఆ తరువాత ఎంతో హాయి అనిపించింది. ఆ మనిషికి 'థాంక్స్' చెప్పడం బాధ్యతగా భావించాను. ఇంటికి వెళ్ళాను. షరా మామూలే! అర్ధాంగి నన్ను తిట్టింది. కొట్టింది. ఓపిక వున్నంతసేపు జుట్టుపట్టి పీకింది. ఆ తరువాత అలసి పడిపోయింది. ఇంత జరిగినా నాకేమీ బాధనిపించలేదు. ఆమెను మెల్లగా ఎత్తి మంచంమీద పరుండబెట్టాను. ఆ మంచానికి ఎదురుగా గోడకానుకుని కూర్చున్నాను. అంతవరకే తెలిసింది నాకు.

అబ్బ! ఆ రోజు ఎంత హాయిగా గడిచిపోయింది!

నా హాయిని గుర్తించలేని మనుష్యులు, సాటి మనిషి ఆనందాన్ని సహించలేని ఈర్ష్యాళువులు నన్ను త్రాగుబోతు అంటున్నారని తెలిసి కూడా నేను నలుసంత బాధపడలేదు. అందుకే త్రాగడానికి అలవాటు పడ్డాను. అలా అలవాటు పడడానికీ కారణంకూడా చెప్పాను. తరువాత నాలుగైదు రోజులు వదలకుండా వెళ్ళాను, ఆ మిత్రుడింటికి. నా రాకకోసమే కాచుకు కూర్చున్నట్లు అతడు నన్ను సాదరంగా ఆహ్వానించాడు. ఆహ్వానిస్తూ చిరునవ్వు నవ్వాడు. 'నాకు తెలుసు నువ్వు వస్తావు!' అన్న భావన కొట్టవచ్చినట్టు కని

పిస్తున్నదా చిరునవ్వులో. 'చూశావా? నీలాంటి మహాకవికి కూడా మానసిక ప్రశాంతత నివ్వగలిగిన స్తోమత గలిగినవాణ్ణి' అన్న దర్పం తొణికిసలాడుతుందా చిరునవ్వులో. అందుకే ఆ మీదట అతనింటికి వెళ్ళలేక పోయాను. తాగిన రోజు బాధ లేదు. కానీ, లేనిరోజు మాత్రం బాధకు బాధ తోడయ్యేది. మోయలేని బరువయ్యేది.

ఆ రోజు బాధకు బాధ తోడయింది. నాపై దాడిచేసి నన్ను చిత్తు చిత్తుగా వోడించి, విజయగర్వంతో విశ్రాంతి పేర పడివున్నది నా శత్రువు. అపకారికి ఉపకారం కాకపోయినా, నమ్మకం ప్రధానంగా బ్రదుకుతున్న వాడిని గాబట్టి కాచుకు కూర్చున్నాను. ఆమె నిజంగా నా అర్ధాంగి. అంటే శరీరంలో సగం భాగం. సగభాగం నలిగి మూలుగుతూ వుంటే మరొక సగం విశ్రాంతి తీసుకుంటూ ఉంది. చిత్రమైన అనుభూతి! ఈ బ్రదుక్కు విముక్తి లేదా? అని ఆలోచిస్తూవున్నాను.

రాతికి రంగులు పులిమి దేవుడనుకునే వాళ్ళు వరుసబెట్టి వాళ్ళ కష్టాలు ఆ రాతితో మొరబెట్టుకుని ఊరట చెందుతారు. ఇహ పరలోకాలను సృష్టించుకుని, అందులో పౌరసత్వపు హక్కు పొందిన వాళ్ళు కష్టాలను పూర్వజన్మ సంచితాలని సరిపెట్టుకుంటారు. తాళిగట్టిన పెళ్ళాంతో కొందరు తలపోసుకుంటారు. చెలికాండ్రతో కొందరు వెలపోసుకుంటారు. ఎవ్వరి మీద నమ్మకం కుదరని నాకెవరుంటారు? ఉన్న ఆ యిద్దరిలో ఒకరు నిద్ర పోతున్నారు. మరొకరు కాసులివ్వందే కరుణించరు. పద్యాలయితే వస్తాయి. గంటకు గంపెడు వస్తాయి. రాసులు పోయగలిగినన్ని వస్తాయి. పద్యాల రాసులకు కాసులువస్తే మరి ఈ గతి ఎందుకు పట్టేది?

"మామయ్య! మామయ్యా! తొందరగా రా మామయ్యా! నాన్న పిలుస్తున్నాడు. రా మామయ్యా"—ప్రక్కింటి పరంధామయ్యగారి పాప పరుగెత్తుకుంటూ వచ్చి పిలిచింది. ఆ పసికందు గసపోసుకొనే తీరు చూస్తే ఏదో అవాంతరమే జరిగినట్లుంది.

'ఎందుకమ్మా?'

'నువ్వే చూద్దువుగాని రా మాఁవయ్యా!' అంటూ చేయిపట్టుకుని లాగింది. వెళ్ళాను.

అప్పటికే అక్కడ ఇరుగు పొరుగు అమ్మలక్కలు గుమిగూడి వున్నారు.

సంప్రదాయమని గణితశాస్త్రజ్ఞుడు మూడు సమాంతరరేఖలను గీచి, మధ్యగత సరళరేఖమీద ఓ బిందువుపెట్టి ఏదో సమస్యను సృష్టించి, పరిష్కారమార్గం కనుగొనలేక వదిలిపెట్టి వెళ్ళినట్టున్న మూడు విభూతి పట్టెలు ...మధ్య కుంకుమ బొట్టు ...పరంధామయ్యగారి విశాలమైన నుదుటికి వింత తేజస్సు నిస్తున్నాయి. మెడలో రుద్రాక్ష మాలలు...యజ్ఞోపవీతము... పట్టు వస్త్రధారణ....వేషం బాగా వుంది. ప్రేక్షకులూ వున్నారు. నాటక మేమిటో అర్థం కాలేదు. పరంధామయ్యగారు సాదరంగా ఆహ్వానించారు. కూర్చొనడానికి వుచితాసనాన్ని చూపించారు. రంగస్థలంమీద ఒక స్టూ వుంది. ఇద్దరు చిన్నపిల్లలు స్టూకు ఇరుప్రక్కల కూర్చున్నారు. తెరలేదు గానీ పరంధామయ్యగారు తన ప్రసంగంతో తెర తొలగించారు.

"కవిగారూ! మీకు దేవుడిమీద నమ్మకము లేదు. నాకు వుంది. ఈ విరుద్ధాభిప్రాయాలతోనే ఇరుగుపొరుగ్గా బ్రతికాము. ఇదే భగవంతుడి లీల. ఎన్నాళ్ళుగానో మీకు భగవంతుడిని గురించి చెప్పాలనుకున్నాను. సమయము, సందర్భమూ కలిసిరాలేదు. ఈ రోజు వాడి పిలుపు వచ్చింది. పిలిచాను. అచేతనము, జడపదార్థమూ—అయిన స్టూ మీరు అడిగినదానికి సమాధానము చెబుతుంది" అన్నాడు.

నేను నవ్వినాను.

"నవ్వకండి. యదార్థము చెబుతున్నాను. భగవంతుడు ఈ స్టూలో ప్రవేశిస్తాడు. మీరు చూడవచ్చు. అడిగిన ప్రశ్న సానుకూలమయేటట్లుగా వుంటే—సరి సంఖ్యలో, విఫలమయ్యేటట్లయితే—బేసి సంఖ్యలో ఈ

స్టూ కాలు నేలను తాకుతుంది" అని అంటూ స్టూమీద ఓ ఖాళీపాత్రను పెట్టాడు. దానిమీద ఓ మూత వుంచాడు. ఆ మూతమీద ఇద్దరు పిల్లల్ని చేతులు మోపి వుంచమన్నాడు. అటుపై పద్మాసనాసీనుడై కన్నులు మూసుకొని అస్పష్టంగా ఏదో గొణుక్కున్నాడు. స్టూమీద మూత ఒక్కసారి అలా ఎగిరిపడింది.

"కవిగారూ! స్టూలో భగవంతుడు ప్రవేశించాడు. మీరడిగినదానికి సమాధానము చెబుతాడు. అడగండి" హుందాతనం ఉట్టిపడుతూంది, పరంధామయ్యగారి పలుకుల్లో.

మూత ఎగిరిపడడానికి ఆస్కారమేమీ లేదు. స్టూలో కిరసనాయిలు లేదు. మంట అసలే లేదు. పాత్రలో నీళ్ళు లేవు. ఆవిరి వస్తేగాని మూత ఎగిరిపడకూడదని విజ్ఞానశాస్త్ర నియమము. ఆవిరి రావడానికి ఆస్కారమే లేదు. పోనీ, పిల్లవాళ్ళకిచ్చిన ట్రైనింగు అనుకుందామంటే—పాపం! పసిబిడ్డలు. ప్రయత్నించినా ఈ లోకంలో వాళ్ళకు స్థానం కల్పించలేము. నాకు ఆశ్చర్యంవేసిన మాట వాస్తవమే. అయినా ఇంద్రజాలికులున్నారు కదా? పరంధామయ్యగారు మంచి ఇంద్రజాలికులే అనుకున్నాను.

"అడగండి, కవిగారూ!" మళ్ళీ హెచ్చరించాడు పరంధామయ్యగారు.

వాదనవల్ల ఒరిగేదేమీ లేదు. ఇదొక తమాషా! తాను నమ్మిన సత్యాన్ని చాటడానికి మానవుడు నేర్చుకున్నగారడీ. చూచినదానివల్ల తప్పు లేదు. అందువల్ల "ఇంతమంది వున్నారు కదా! వాళ్ళందర్నీ అడగనివ్వండి. ఆపైన చూద్దాం" అన్నాను.

ఒకావిడ మదరాసు లాటరీలో తానుకొన్న రూపాయ టిక్కెట్టుమీద లక్ష రూపాయలు వస్తాయా? అని అడిగింది. స్టూ కాలు నేలమీద మూడు దెబ్బలు కొట్టింది. అచేతనమయిన స్టూ చేసిన పనికి ఒకవైపు ఆశ్చర్యం వేస్తున్నా, లక్షరూపాయలు లాటరీలోరాదని తెలిసినపుడు ఆవిడ ముఖం

ముప్పైఆరు వంకలు తిరగడం, ఆమె నిట్టూర్చడం చూస్తూంటే—ఈ మనుష్యులకు ఇతరుల సొత్తుమీద ఎందుకిలాంటి ఆశలు కలుగుతాయో తెలియక ఆశ్చర్యపడ్డాను. మరొకావిడ గర్భవతి అయిన కోడలు కొడుకును కంటుందా? కూతురుని కంటుందా? అని ప్రశ్నించింది. స్టౌ కాలు రెండు దెబ్బలే కొట్టింది. అంటే కొడుకట. ఆవిడ ఆనందం వర్ణనాతీతం. కోడలు కొడుకును కని, ఆ కొడుకు పెరిగి పెద్దవాడై, అంతకంటే పెద్ద డాక్టరై, అందచందాల పెళ్ళాంతోబాటు లక్షరూపాయల ఆస్తిని గూడా కట్నంక్రింద కొట్టేసి, తనకో కాశీమాల, కెంపు అడ్డిగ బహూకరించినంత సంబర పడిపోయింది. ఎంత విచిత్రమైనదీ మానవుడి మనస్తత్వము? ఆశ మనిషిని జీవింపజేస్తే, ఇలాంటి హామీలు బ్రదుక్కు మద్దతు నిచ్చేట్లు తోస్తూంది.

"కవిగారూ! మీరు...." అన్నాడు పరంధామయ్య.

ఇక వాయిదా వేయడం మంచిది కాదనిపించింది. ఏమి అడగాలో తోచలేదు. అప్రయత్నంగా జేబులోనికి చేయి వెళ్ళింది. చేతికి అగ్గిపెట్టె తగిలింది. ఆ పెట్టెను చేతిలో పట్టుకున్నాను. కనీసం తీసి కూడా చూడలేదు.

"ఇందులో ఎన్ని పుల్లలున్నాయి?" నా ప్రశ్నగా అడిగాను.

స్టౌ కాలు నేలమీద ఒకటి.... రెండు.... మూడుదెబ్బలు వరుసగా కొట్టడానికి ఆరంభించింది. నేను జాగ్రత్తగా లెక్కబెట్టుకుంటున్నాను. ఇరవై ఎనిమిది దగ్గర ఆగిపోయింది. అగ్గిపెట్టెను తీసి పుల్లలు బైట పోశాను. ఒక్కొక్కటిగా లెక్కబెట్టాను. ఆశ్చర్యం! సరిగ్గా ఇరవై ఎనిమిదే వున్నాయి. ఒక్కక్షణం శరీరం గగుర్పొడిచింది. ఆశ్చర్యము, ఆనందము, సందేహమూ ముప్పిరిగొన్న ఫలితమిది!

'కవిగారూ! మీ కిప్పుడు కావలసింది మానసిక ప్రశాంతత. మీ గృహిణి ఆరోగ్యం చక్కబడడం. అంతేకానీ అగ్గిపెట్టెలోని పుల్లల సంఖ్య కాదు. అరవిందాశ్రమములో మీకా ప్రశాంతత లభ్యమవుతుందేమో అడిగి

చూడండి" అని మందలింపు ధోరణిలో సలహా యిచ్చాడు పరంధామయ్య. అదేమి చిత్రమో? బుద్ధిమంతుడైన కుర్రాడివలె అదే ప్రశ్న అడిగాను. స్టౌ కాలు రెండు దెబ్బలే కొట్టింది.

"వెళ్ళి రండి కవిగారూ! తప్పకుండా అరవిందాశ్రమం వెళ్ళిరండి. మానవుడికి ఎవ్వరూ యివ్వలేని మానసిక ప్రశాంతతను 'మతం' ఇవ్వ గలుగుతుంది. మతంమీది నమ్మకం అందుకు తోడ్పడుతుంది. ఆశ్రమాలు అందుకు దోహదమిస్తాయి. మీరు తప్పక వెళ్ళిరండి. భగవంతుడు మీకు మేలు చేస్తాడు" నిమీలిత నేత్రుడై పరంధామయ్యగారు పలికిన పలుకుల్లో ఏదో శక్తి వుంది. నాకు తెలియకనే తల ఆడించాను, గంగిరెద్దులా.

అరవిందాశ్రమాన్ని గురించి ఆలోచించుకుంటూ ఇంటికి వచ్చాను. అరవిందాశ్రమం సంగతి దేవుడెరుగును కానీ, మా ఆశ్రమం అప్పటికే భీభత్సంగా తయారయింది. శత్రువు మేల్కొని వుంది. ఎదుట వుంటే వా మీద చూపవలసిన ప్రతాపాన్ని ఇంట్లో వస్తువులమీద చూపింది. ఇల్లంతా గందరగోళంగా వుంది. ఆ ఆశ్రమాన్ని చక్కబెట్టడంలో నిమగ్న డయ్యాను.

పరంధామయ్యగారి ప్రతిభావిశేషమేమిటో గాని వింత అనుభూతి మనస్సును పూరిస్తూనే వుంది. అదొక దొమ్మరివాడి గారడీలాగా తోచినా, పాండిచ్చేరి ప్రయాణానికి మాత్రం అదొక సాకుగా పరిణమించింది. అప్పటికి ఆంధ్రదేశంలో గాంధీగారి సూత్రాలకు నూరేళ్ళు నిండలేదు. అందుకే మద్య పాన నిషేధం అమలులో వుంది. నాలాంటివాడెవడైనా తాగాలంటే దొంగ చాటుగా నాలుగు కాసు లెక్కువ పెట్టాలి. నాలుగుకాసు లెక్కువపెట్టినా, దొరికినా మళ్ళీ ముసుగుబ్రతుకే. దేశంలో పెద్ద పెద్ద నాయకులు, ధనికులు ముసుగు బ్రతుకులకు బాగా అతికిపోయారు. మహాత్ముడు కష్టపడి స్వయంగా వడికి, నేసి వీళ్ళందరికీ బురఖాలు సప్లయి చేశాడు. అందుకే అలాంటి నాయకుల ఇండ్లల్లో రెఫ్రిజిరేటర్లలో వాట్-69 లు వుంటాయి. నిషేధాజ్ఞలు

ఆ రెఫ్రిజిరేటర్లలో దూరి చల్లబడిపోతుంటాయి. దీనిని చూస్తున్న సామాన్యుడు నోరు చప్పరిస్తూ, 'పెట్టిపుట్టిన అదృష్టవంతులు అనుభవిస్తున్నారు' అని సరిపెట్టుకుంటాడు. పూర్వజన్మలో పెట్టలేక సామాన్యుడుగా పుట్టిన సామాన్యుడు ఈ జన్మలో కూడా పెట్టలేక మరో జన్మలో కూడా అతి సామాన్యుడుగానే పుట్టుతున్నాడు. సామాన్యుడు నమ్మిన సిద్ధాంతమిది. నేనెంత కవిత్వం వ్రాస్తే, ఈ సిద్ధాంతం మారేది?

పాండిచ్చేరిలో ఈ అవస్థ లేదట. ఎక్కడబడితే అక్కడ దొరుకుతుందట. తనివితీరా త్రాగి తన్మయత్వంతో తిరగవచ్చుట. ఒక దేశంలోనే ఒక రాష్ట్రానికి మరొక రాష్ట్రానికీ ఎంత తేడా? అందుకే వీలుచూచుకొని, పాండిచ్చేరికి బయలుదేరాను.

ఒక సరళరేఖను గీచి దానిమీద నాలుగు లంబరేఖలు గీచినట్లుగా సముద్ర తీరాన్నంటిపెట్టుకుని పెద్దబాట....ఆ బాటకు పశ్చిమంగా విస్తరించి, ఊరినినాలుగు సమ భాగాలుగా విభజిస్తూ నాలుగు రోడ్లు ...చూడ ముచ్చటగా వుంది పాండిచ్చేరి. ఆంధ్రదేశంలో సుమారుపాటి ఓ తాలూకా విస్తీర్ణం గలిగిన ఓ ప్రత్యేక రాష్ట్రం అది. ఆ రాష్ట్రానికి రాజధాని పాండిచ్చేరి. ఆ రాజధానిలో ఎత్తయిన మేడలున్నాయి. సుమారుపాటి సుద్ద మిద్దెలున్నాయి. శివార్లలో చిన్న గుడిసెలున్నాయి. మేడల్లో, సుమారుపాటి మిద్దెల్లో, పూరి గుడిసెల్లో మనుష్యు లున్నారు. దేవుడు సృష్టించిన మనుష్యులున్నారు. అయితే ఆ మనుష్యుల్లో విభేదాలు కొట్టవచ్చినట్టు కన్పిస్తున్నాయి. గుడిసెలో మనిషి 'నాటు' జుర్రుకుంటూంటే, మేడలో మనిషి 'వాట్' నంజి నంజి త్రాగుతుంటాడు ఈ త్రాగుబోతు వెధవ అలంకారప్రాయంగా కూడా తాగుడు మాటలే మాట్లాడుతున్నాడనుకోకండి. మీ మాటల్లో చెప్పాలంటే - ఒకడు గంజి తాగుతుంటే, ఆ గంజికి కూడా నోచుకోని దౌర్భాగ్యుడొకడు ఎవరో పుణ్యాత్ముడు వదిలిపెట్టిన ఎంగిలాకులోని పంచభక్ష్య పరమాన్నం కోసం కుక్కలతో కాట్లాడుతున్నాడు. పూలమాలలతో రాజకీయ నాయ

కులు, కాగితాలతో రచయితలు సతమతమవుతూనే వున్నారు సమతా సాధన కోసం. వీళ్ళు ఆగరు. అది జరుగదు. అస్తవ్యస్తంగా వున్న ఈ సమాజానికి దర్పణం పట్టినట్టుగా వుంది ఆ పట్నం కూడా. అంతవరకూ హద్దూ పద్దూ లేకుండా వాగి అధికార దర్పానికి మార్పులు చేర్పులు చేసుకుంటున్న బుర్రమీసాల పోలీసు అనుకోకుండా అవతరించిన పై అధికారిని చూచి ఎగిరిపడి లేచి చేష్టలుడిగి నిలబడి సెల్యూట్ చేసినట్లు ఆటు పోట్లతో అల్లకల్లోలంగా వుండే సముద్రం ఆ పట్టణం దగ్గర ప్రశాంతంగా వుంది.

పొద్దస్తమానమూ వూరంతా కలియతిరిగాను. గమ్యము లేకుండ గాలివాటంగా తిరిగే బెలూన్‌లా గాలిలో తేలిపోతూ తిరిగాను. కామెర్లకంటి వాడికి ప్రపంచమంతా పచ్చగా కన్పిస్తుందేమో? నా పిచ్చి నాకు ఇంపు కూరుస్తూ వుంది. ఎటు చూచినా బ్రాందీ అంగళ్ళే! అంగళ్ళ నిండుకూ బీరువాలే! బీరువాల నిండుకూ ముచ్చటైన సీసాలే! ప్రపంచములోని ఆనందాన్నంతా పట్టి తెచ్చి, ఆ సీసాలలో నింపి జాగ్రత్తగా సీలువేసి బీరువాల్లో భద్రపరచి ఆనందంతో వ్యాపారం చేసుకుంటున్న స్వార్థులైన మనుష్యుల మీద కసి పెరుగుతూవచ్చింది, ఆ సీసాలను చూస్తున్నకొద్దీ. గోరంత ఆనందం గుండెల్లో దూరితే ముప్పైమూడు వంకర్లు తిరిగే మనుష్యులకంటే గొంతువరకు ఆనందాన్ని నింపుకున్న ఆ సీసాలు నిబ్బరంగా బీరువాల్లో నిలబడి వుంటే వాటిమీద గౌరవం పెరుగుతూ వచ్చింది.

ఆశ్రమంలో దొరకబోయే మానసిక ప్రశాంతతను గూర్చి నాకు తెలియదు. ఆశ్రమాలు పరిరక్షిస్తున్న మతంమీద నాకు తగని మంట. వీటి మీద నమ్మకమూ లేదు. నేను నమ్మింది, నాకు ఆనందాన్నిచ్చింది సీసాలోని ద్రవపదార్థమే. అందుకే ఆశ్రమాని కంటే త్రాగడానికి ఆశ్రయంకోసం మనస్సు మథనపడుతూ ఉంది. వీధికొక బారు ఆహ్వానిస్తూ ఉంది. అయితే వాటి తీరుతెన్నులు చూచి మనస్సు అటువైపు మొగ్గలేదు. అన్నీ డెన్స్‌లాగా వున్నాయి. నిజానికి ఈ మనస్సు చాలా చిత్రమయింది. హీనులు, దీనులు

తాడితులు—పీడితులు ఈ మనస్సును స్పందిస్తారు. సామాన్యులకు ఈ మన స్సులో చోటు వుంది. ఈ స్పందనలోనే కవిత్వమనే సృష్టి జరుగుతుంది. ఆ కవిత్వానికి కన్నీటి అభిషేకాలు జరుగుతుంటాయి. డెన్‌లాంటి ఈ బార్‌లలో కూడా సామాన్యులే వుంటారు. మరి అక్కడికి వెళ్ళడానికే మనసు అంగీకరించడం లేదు!

సముద్ర తీరానికి సమాంతరంగా వున్న బాటమీద ఒక పెద్ద భవనం కనిపించింది. ఆ భవనం ముందు 'హోటల్ కాంటినెంటల్—బార్ అండ్ రెస్టారెంట్' అని అందమైన బోర్డు వ్రేలాడుతూ వుంది. గబగబ నడిచాను, ఆ హోటలువైపు.

"తైరో!"—ఘూర్కా చేతికర్రను అడ్డుపెట్టాడు.

నడు మధ్య వీడేమిటి? పానకంలో పుడకలా! అని ముందుకు పోవ డానికి ప్రయత్నించాను. నాలాంటి జానాబెత్తెడు మనిషికి ఆ కర్రను దాటడం అశక్యమని తేలిన తర్వాత కాసేపు తెలుగులో మరి కాసేపు ఇంగ్లీషులో విసుక్కున్నాను. అరవ భాషలో కోపగించుకోవడానికి ప్రయ త్నించాను. వాడిది ఒకటే పట్టు. అడ్డుపెట్టిన కర్రను అటూ ఇటూ కదల్చ కుండా వాడికి వచ్చిన ఒకటే భాషను దంచేస్తున్నాడు. నాలో ఓపిక నశిం చింది. ఏదైనా ఓర్చుకోవచ్చునేమో కానీ, మనిషి సాటిమనిషి ఆనందానికి అడ్డుపడుతూంటే ఓర్చడం కష్టమే! బెత్తెడంత మనిషి గుప్పెడు పైకి లేచాను. అదే స్థాయికి గొంతుస్థాయి కూడా పెరిగింది. అన్ని భాషలు కలిపి గుప్పుతున్నాను. రెండు చేతులతో బాణాలు వదిలిన అర్జునుడు సవ్యసాచి అనిపించుకున్నాడు. ఒక నోటితో మూడు భాషలు....నన్నింకా 'పద్మశ్రీ'ని చేయని ప్రభుత్వాన్ని నిందించే అవకాశమిచ్చిన ఘూర్కాన్ని మనసులోనే అభినందిస్తున్నాను. ప్రశాంతంగా వున్న 'కాంటినెంటల్' ముందు మా వాగ్యుద్ధం పెద్ద జగడం క్రింద లెక్కే! మేనేజరు పరుగెత్తుకొని వచ్చాడు!

ఎగాదిగా నన్నొకసారి చూశాడు మేనేజరు. వెనక్కు ముందుకూ

వూగాడు. రెండుచేతులను రెండు జేబుల్లో దురుక్కున్నాడు. ఒక కాలు వెనక్కు మరొక కాలు ముందుకు పెట్టుకుని రాజశీవిలాంటి శీవిని తకీమని ప్రదర్శించాడు. అన్నిటికీ అలంకారప్రాయంగా ఓ వెకిలి నవ్వు నవ్వాడు.

ఆ వెకిలి నవ్వుకు కారణం అతడు ధరించిన తెల్లటి రిమ్‌లెస్ కళ్ళద్దాల అంచుల్లో కనపడింది. నల్లగా మాసిన నాలుగు మూరల పంచ ....చిరుగులు పడడానికి సిద్ధంగా వున్న జుబ్బా....అంచులు తేసిపోయి అక్కడక్కడ సరిగ మాత్రం మిగిలివున్న పై పంచ....కాంటినెంటల్ హోటల్ మేనేజరుగారికి వెకిలినవ్వు తెప్పించడంలో ఆశ్చర్యంలేదు.

వెకిలి నవ్వు తర్వాత మనిషి ఏటవాలుగా వాలాడు. ఎడమచేతిని జేబునుండి సరుక్కున లాగాడు. నన్నొక కోణంలో చూస్తూ ఎడమచేతితో నాకొక బోర్డు చూపించాడు. బోర్డువైపు చూశాను. ఉదారంగు ప్లాస్టిక్ ఇంగ్లీషు అక్షరాలు చూడడానికి ముచ్చటగా వున్నాయి. చదువుకుంటే గతుక్కుమనింది. 'రైట్స్ ఆఫ్ అడ్మిషన్ రిజర్వ్డ్' అని వుంది.

"అయితే ఎవరికి ప్రవేశం?"

"మీలాంటివాళ్ళకు మాత్రం కాదు."

"కారణం?"

"మీ వేషం హైక్లాస్ సొసైటీలో అతకదు కాబట్టి!"

"హైక్లాస్ సొసైటీ ఒక్క వేషం మీదనే ఆధారపడి వుందా?"

"అని ఈ హోటలు అధినేతలు అభిప్రాయపడుతున్నారు."

"ఈ లాంటి దురభిప్రాయాలతోనే దేశం యిలా అధోగతిపాలు పట్టింది."

"చాల పెద్ద పెద్ద మాటలే!"

"మీ హైక్లాస్ సొసైటీవాళ్ళ మాటలకంటేనా?"

"అలాగే అనిపిస్తోంది. ఇంతకూ మీరెవ్వరు?"

"మనిషిని."

"అది తెలుస్తూనే వుంది."

"అయితే అడగడమెందుకూ?"

"మనిషిగా మనిషిదగ్గర సమాధానం పొందడానికి!"

నాకు ఆశ్చర్యం వేసింది. కాంటినెంటల్‌హోటలు మేనేజరు సెంటి మెంటల్ ఫూల్ కాదనిపించింది. దారాన్ని లాగితే రెండు చేతులు వేరవు తాయి. వాదాన్ని లాగితే రెండు చేతులు కలుస్తాయి. చేతులు కలపడం ఆరోగ్యప్రదం కాదు.

"తెలుసుకుని ఏం లాభం?"

"అది తర్వాత తెలుస్తుంది" అన్నాడు ధీమాగా.

"అయితే నే నొక కవిని! ఆంధ్రదేశం నుండి వచ్చిన కవిని."

ఆ మాట చెవిని పడడంతో ఏదో అపచారం చేసినవాడిలాగ అతడి మొగము ముడుచుకు పోయింది. చేయితగిలితే ముడుచుకుపోయే అంతర్దా మరలాగ. ముడుచుకుపోయింది. "మీరు కవులా? మీరు కవులా?" అని ఒకటికి రెండు మూడుసార్లు అస్పష్టంగా గొణుక్కున్నాడు. నాకు మరింత ఆశ్చర్యం వేసింది. తెలుగుకవికి తెలుగుదేశంలో దొరకని గుర్తింపు అరవ దేశంలో దొరకబోయేట్లు తోచింది. అంతవరకు ఎదలో పేరిన అసంతృప్తి వేడికి వెన్నలా కరిగిపోయింది.

"నాతో రండి!" అని ముందుకు నడిచాడు మేనేజరు.

వెళ్ళాను. అభిమానధనుడైన దుర్యోధనుడు హాయిగా స్వాగతం పలుక్కున్నాడు మయసభలో. నా పాలిటికి ఆ హోటలు ఒక మయసభలాగ ప్రత్యక్షమైనా నేను దుర్యోధను డంతటివాడిని కాను. అంతటి అభిమానము నాలో మిగలలేదు. బిత్తరపడి చూస్తూ నిలబడ్డాను. గోడల్లో నీడలు కనిపి స్తున్నాయి. కూర్చుంటే మైలపడుతామని కుర్చీలు వెక్కిరిస్తున్నాయి. అంద మైన చిత్రాలు ఆనందాన్ననుభవించమని ప్రబోధిస్తున్నాయి. అల్లంత

దవ్వులో నీలాలు పారే కడలి నింగితో కలిసి సహవాసదోష మన్నట్లు నిర్మలంగా వుంది. అప్పుడే రేవులో నిలబడ్డ నౌకనుండి దిగిన ప్రయాణీకులు కడలిమీద కట్టిన వంతెనమీద నడుస్తూ తిరిగితిరిగి చూస్తున్నారు. మరులు తెరల ప్రభావమేమో మరి? విచిత్రానుభూతుల్ని పులుముతూ వుంది ఆ దృశ్యం. దీనికి తోడు అరసీసా ఖాళీచేస్తే—అక్కడే కాపురం పెట్టవచ్చునన్న ఆశ కలుగుతూ వుంది.

"కవిగారూ!"

తిరిగి చూశాను.

"ఈ సొసైటీలో మీకు చోటులేదు. మిమ్మల్ని యిక్కడ ప్రవేశపెట్టిన ఉదంతం అధినేతల చెవినిబడితే, ఆ పైని నాకు కూడా యిక్కడ చోటు వుండదు. అయినా మీరు కవులు. సమాజములో మీకొక ప్రత్యేక స్థానముంది. అందుకే యిక్కడ కూడ మీకొక ప్రత్యేకస్థానం యిస్తున్నాను. అదిగో! ఆ గదిలో కూర్చోండి. సరిగ్గా అరగంట మీకు వ్యవధి నిస్తున్నాను. మీకు చెప్పవలసిన పనిలేదు. నేను మరొక్కడికి వంగిన వాడిని."

మనస్సు ఉబ్బిపోయింది గాలివూదిన బెలూన్‌లాగ. మేనేజరుగారి అభిమానానికి విలువ కట్టలేని మనసు పరిపరివిధాల ఆలోచిస్తూ, ఆలోచనలకు మాటల రూపాన్ని సంతరించలేకపోయింది. 'థేంక్స్' - అన్న ఒక్క మాటతో గదిలో ప్రవేశించాను. లోకంలో నాకు మిగిలిన యిద్దరు మిత్రులలో ఒకరు నా భార్య. రెండవది మద్యము. ఒకరు తన్నుతాను మరిచిన స్థితిలో ఇంట్లో వున్నారు. మరొకరు నన్ను నేను మరచిపోవడానికి నా ఒంట్లో ప్రవేశిస్తున్నారు. అయినా సరిగ్గా ఇరవైతొమ్మిదవ నిముషంలో కాంటినెంటల్ హోటల్ కౌంటర్ దగ్గర నిలబడ్డాను. చిల్లులుపడ్డ జుబ్బా జేబునుండి మాసిన కాగితాన్ని తీసి టేబిలుమీద పెట్టాను. నేను ఇప్పుడు ఒంటరివాణ్ణి కాదు. మిత్రుడొకడు తోడున్నాడన్న దర్పం తొణికిస

లాడుతూ వుంది ప్రతి చేతలో. మాసిన కాగితాన్ని టేబిలుమీద వుంచిన తీరే ఈ సత్యాన్ని ఋజువు చేస్తున్నది!

మేనేజరు ఎగిరిపడిలేచాడు. రెండు చేతులు మోడ్చాడు. 'క్షమించండి' అన్నాడు.

"ఎవరు ఎవర్ని?"—

"మీరు నన్నే!"

"కారణం?"

"వేషంమీదనే సంస్కారం ఆధారపడి లేదు."

"ఎలా గ్రహించావు?"

"ముప్పై నిముషాల వ్యవధినిస్తే, సరిగ్గా ఇరవైతొమ్మిదవ నిముషంలో మీ రిక్కడ నిలబడడంతో!"

"ఇదొక్కటే సంస్కార లక్షణమా?"

"కాకపోవచ్చు. కానీ నాతో రండి" అన్నాడు.

"మరి ఈ వేషం?" అన్నాను సందేహంగా.

"క్షమించమని అడిగానుగా! దయచేసి మళ్ళీ ఆ ప్రసక్తి తేకండి. రండి!" అంటూ లోనికి నడిచాడు.

నేను వెంబడించాను. లోనికి వెళ్ళి ఒక అందమైన తలుపును లోనికి నెట్టాడు. కిర్రుమని శబ్దం చేసిం దా తలుపు. ఒళ్ళు పులకరించే శీతల పవనాలతో కలిపి కళ్ళకు కెంపురంగు లిచ్చే ఖరీదైన ద్రవపదార్థాల వాసన గుప్పుమని వీచింది. అదొక 'ఏర్ కండీషన్డు హాలు'. హాలు శుభ్రంగా వుంది. హాలునిండుకూ అందమైన కుర్చీలు, టేబిళ్ళు ఉన్నాయి. కుర్చీలమీద ఖరీదయిన దుస్తులు కైపులో తూలుతున్నాయి. రోగం వచ్చిన కోళ్ళు కళ్ళు తేలవేసినట్టు కొందరు కళ్ళు తేలవేశారు. కొందరి మెడలమీద తలలు నిలబడడమే లేదు. కొందరు టేబిలుమీద అలానే వాలిపోయారు. కొందరు సొంగకారుస్తున్నారు. కొందరు మరి కొందరిని చూచీ చూడనట్లు

చూచి నవ్వీ నవ్వనట్లు నవ్వుతున్నారు. కొందరు ధీమాగా కూర్చుని పాపాన్ని కసిగా కాల్చినట్లు, సిగరెట్లను కాల్చివేస్తున్నారు. లోకాతీతమైన ఆ లోకం హాయిగా వుంది.

"ఇది తాగు."

"అహఁ! ఇక నాకు వద్దు!"

"అలా కాదు. తాగి తీరాల్సిందే!"

"ఇక నేను చచ్చినా తాగనంటే తాగను!"

"భర్త మాటను భార్య అంగీకరించాలి!"

"భార్య అభిప్రాయాన్ని భర్త గౌరవించాలి!"

'ఛత్'మన్న చీదరింపుకు 'టక్' మన్న శబ్దం శ్రుతికలిపింది. అందమైన గ్లాసు ముక్కలుముక్కలైంది. అందులో ద్రవపదార్థం టేబిలుమీద గబగబ పారాడి. అందమైన దుస్తుల్లో ఆత్మార్పణ చేసుకుని మరకలు మాత్రం నిలిపింది. రంగు లైట్ల కాంతిలో పగిలిన గ్లాసు పెంకులు పకపక నవ్వుతున్నాయి!

హాల్లో మేము నిలబడిన టేబిలు దగ్గర జరిగిన సంఘటన. ఎవరో ఇద్దరు అమెరికను దంపతులు ఇంగ్లీషులో కీచులాడుకుంటున్నారు. ప్రశ్నార్థకంగా చూశాడు నా వైపు మేనేజరు. ఆ చూపుల్లో 'చూశారా! హైక్లాస్ సొసైటీని?' అన్న అర్థముంది. 'వాళ్ళతో ఎలా వేగడం?' అన్న అభ్యర్థన వుంది. నేను అక్కడి నుండి కదిలి అమెరికను దంపతుల మధ్యగా నిలబడ్డాను. ఆ అమెరికను నన్ను ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఆయన ఒక కవి. ఆంధ్ర దేశం నుండి వచ్చిన ఒక కవి!" మేనేజరు పరిచయం చేశాడు ఇంగ్లీషులో. గ్లాసు పగలడం వరకు పెరిగిన ఆ కీచులాట పోట్లాటగా మారుతుందేమోనన్న భయం మాకు లేకపోలేదు.

కావలిస్తే సర్దిచెప్పడం, తమకు తామే సర్దుకోవడంలో ఆంధ్రులు గట్టివారు. అందులో నేను కవిని. అలాంటి తెలివితేటలు నాకు మరి కొంచెం ఎక్కువగా వుండవచ్చు. అందుకే ఆ బాధ్యత నాకు నేనుగా నెత్తిన పెట్టుకోదలిచాను. అయితే నన్ను నేను పరిచయం చేసుకోవడానికి కాస్త యిబ్బంది పడ్డాను. మేనేజరు పుణ్యం కట్టుకున్నాడు. అతడి సందర్భశుద్ధికి ముగ్ధుడినయ్యాను.

"ఓఁ! కవులా?....రండి....రండి! కూర్చోండి. నాకు కవులంటే చాలా ఇష్టం." వ్యాట్‌సిక్స్‌టీ నైన్ నంజి నంజీ త్రాగినట్టుగా ముద్దు ముద్దుగా పలికాడు అమెరికనుడు.

రోగి కోరింది, వైద్యుడు చెప్పింది - రెండూ ఒకటే!....

నేను చిరునవ్వు నవ్వాను.

"ఔనౌను! మా వారికి కవులంటే చాలా యిష్టం....తన భార్యకంటే కూడా!" నన్నోకరకంగా చూస్తూ - అదో రకంగా అన్నది. ఆ యువతి - అమెరికన్ సతీమణి! ఆ వ్యంగ్యోక్తికి మనసు లవలేశం బాధపడినా, ఆమె కలుపుగోలు తనానికి ఆనందపడ్డాను! కుర్చీలో కూర్చున్నాను. ఇక పరిస్థితి చక్కబడవచ్చునని మేనేజరు పై సర్దుకుంటున్నాడు ఆప్యాయంగా.

"కావచ్చు! కావచ్చు!....బాయ్? వన్‌మోర్ విస్కీ" ముసిముసిగా గొణుక్కున్నాడు అమెరికనుడు. అందుకోసమే కాచుకుకూర్చున్న బాలుడు క్షణాలలో సరంజామాతో ప్రత్యక్షమైనాడు. 'దయచేసి తీసుకోండి!' అంటూ గ్లాసు నా వైపు నెట్టాడు అమెరికనుడు. 'ప్లీజ్!' అని నేను ఆ గ్లాసును అతని సతీమణి వైపు నెట్టాను. అతిథి మర్యాదల నెరిగిన ఆడది కాస్త ఇబ్బందిగా ముఖం పెట్టినా గ్లాసు నందుకొనింది.

"ఓఁ! నా భార్యకు భర్తమాట మీదకంటే కవుల మాటమీదనే చాల గౌరవంగా వుందే!" ఆశ్చర్యాన్ని వెలిబుచ్చా డతను.

"అఫ్‌కోర్సు!" అంటూ ఆమె గ్లాసును నోటి కంటించుకొనింది.

"మీరు కోరడం ఆమె తాగాలని. ఆమె తాగుతూవుంది. ఇక వాదాని కిక్కడ తావులేదు. మనం స్నేహితులం. కానివ్వండి." అంటూ నే నొక గ్లాసు నందుకున్నాను.

పరిస్థితి చక్కబడినందుకు మేనేజరు కృతజ్ఞతాభావంతో నా వైపు చూశాడు. బదులుగా యిచ్చిన చిరునవ్వును మోసుకుని బయటికి నడిచాడు. మేం ముగ్గురం మాటల్లో పడ్డాము. ముద్దు ముద్దుగ మాట్లాడుతూ నంజి నంజి తాగుతున్నాము. ఆ సందర్భంలో నా కవితను వినవలెనన్న సద్బుద్ధి కలిగిం దా దంపతులకు. తెలుగు కవిత్వాన్ని ఇంగ్లీషులో విపులీకరించలేక నేనూ, విపులీకరించింది పూర్తిగా అర్థంగాక వాళ్ళూ - ఇద్దరికీ పొత్తు కుదర్చలేక మధ్య మధ్య నిర్దాక్షిణ్యంగా నలిగిపోతున్న వెకిలి నవ్వులు - గంట పది కావస్తోంది. ఉన్నట్టుండి చేతి గడియారాన్ని చూసుకున్నా డా విదేశీయుడు. కొంపలు మునిగినంత గాభరా పడ్డాడు. ఎంతో పొరపాటు జరిగిపోయినట్లుగా బాధపడ్డాడు. భార్యను తొందరగా లెమ్మని బ్రతిమ లాడాడు. 'మళ్ళీ కలుసుకుందాం!' అంటూ నా వద్ద సెలవు తీసుకున్నాడు. ఇంతకూ అతని ఆదుర్దా ఏమిటంటే - సరిగా పది గంటలకు ఎవరినో కలుసుకుంటానని మాట యిచ్చాడట. త్రాగిన ఆ మత్తులో కూడ ఆ విదేశీ యుడికి మాటమీద వున్న గౌరవం చూసే సరికి, నా హృదయం బరు వెక్కింది.

త్రాగుబోతులందర్నీ ఒక గాట కట్టివేస్తే ఆ గుంపు కొన్ని పద్ధతు లను నిర్ణయించుకొనింది. త్రాగుబోతులకు కూడా పద్ధతులా? అని అవహేళన చేయవలసిన అవసరం లేదు. ఈ పద్ధతిని 'టేబిలు మానర్స్' అంటారు. ఈ మానర్స్ మనవాళ్ళకంటే విదేశీయులకే బాగా తెలుసు. మనవాళ్ళయితే, ఒకరి ముఖం ఒకరు చూచుకుంటూ అప్పటికప్పుడు నాట్యావధానాలు ప్రదర్శిస్తారు. అథవా తెగించి యిచ్చినా నాకు త్రాగుడు నేర్పిన మహాశయుడి

వలె దర్పం ప్రకటించవచ్చు. నన్ను ఆహ్వానించిం దొక విదేశీయుడు. అందుకే నా బిల్లును కూడా అతడే చెల్లించాడు.

ఆ దంపతులు వెళ్ళిన తరువాత నేను మేనేజరు దగ్గర సెలవు తీసుకొనడానికి వెళ్ళాను. నన్ను చూచిందే తడవుగా, గబగబ లేచి వచ్చాడు మేనేజరు.

"మేనేజరుగారూ! చాలా కృతజ్ఞుడిని. సెలవు యిప్పించండి." అని అడుగుదామనుకున్నాను. అడుగుదామనుకున్నది అడుగలేకపోతున్నాను. నా అవస్థ గమనించాడు మేనేజరు.

"కవిగారూ! ఈ పరిస్థితిలో మీరు వెళ్ళడం నా కిష్టం లేదు. నే నిక్కడ కేవలం ఒక వుద్యోగిని మాత్రమే. అయినా మీ కోసం ఆనందంగా పాతిక రూపాయలు ఖర్చుబెడ్తాను, గది అద్దె కోసం. ఈ రాత్రికి ఇక్కడ విశ్రాంతి తీసుకోండి." అభ్యర్థించాడు మేనేజరు.

"నే నిప్పుడు అరవిందుడిని చూడాలి."

"ఇప్పుడా? ఈ స్థితిలోనా?"

"అవును! ఇప్పుడే - ఈ స్థితిలోనే!"

"మిమ్మల్నిపుడు ఆశ్రమంలోనికి రానివ్వరే?"

"అదే తెలుసుకోదలిచాను."

"కవిగారూ! నా మాట వినండి. బయట సన్నగా వర్షం పడు తోంది. ఆశ్రమం దాదాపు మైలుదూరానికి పైగా వుంటుంది. ఈ రాత్రిలో - ఈ వర్షంలో - ఈ స్థితిలో మీ రక్కడికి నడిచి వెళ్ళలేరు."

కాదన్న పనిని అవుననిపించడం చిన్నప్పటినుంచి నాకు మహా యిష్టం.

బార్ నిర్వహిస్తోన్న మనిషి మేనేజరు. మానవుడి బలహీనతతో

వ్యాపారం చేసుకుంటున్న మనిషిగా అతనిని లోకం ఆడిపోసుకుంటుంది. అయినా అతనిలోని మానవత నన్ను ముగ్ధుడిని చేసింది. కాని నన్నక్కడ నిలబెట్టలేకపోయింది.

నేను ఆశ్రమాన్ని సమీపించేసరికి దాదాపు అర్ధరాత్రి కావస్తోంది. అంతవరకు నాకు తోడుగా వుండిన నాలోని మిత్రుడు నేను దారికి అడ్డదిడ్డంగా నడిచినా, బురదగుంటల్లో పడినా, పట్టిలేపి ఆశ్రమాన్ని చేర్పించిన నాలోని మిత్రుడు వీడ్కోలు పుచ్చుకోవడానికి ఆతురతపడుతున్నాడు. సన్నగా రాలుతున్న చినుకులు....దారిప్రక్కన బురద గుంటలు....ఆంధ్ర దేశం నుండి వచ్చిన కవిని పరామర్శించిన ఫలితంగా కవి వేషం దివ్యంగా తయారయింది. నేను ఆశ్రమంలోనికి అడుగు పెట్టబోయాను.

"ఆగండి!" చేయి అడ్డు తగిలింది.

ఆగాను. అతనివైపు చూశాను. అత డా ఆశ్రమవాసి.

"దారి తప్పి వచ్చారేం?" అన్నాడు.

"లేదు. మీరే దారి తప్పిస్తున్నారు."

"నేను తప్పించడమేమిటి? మీ రెప్పుడో దారి తప్పారు."

"దారి తప్పివుంటే ఇక్కడి కెలా రాగలిగాను?"

"వచ్చి ఏం ప్రయోజనం?"

"ఏం?"

"మీ కిక్కడ ప్రవేశం లేదుగా?"

"నాకే ప్రవేశం లేదా?"

"అవును! మీకు ప్రవేశం లేదు. మీలాంటి వాళ్ళందరికీ అసలు ప్రవేశం లేదు."

"కారణం?"

"పోనీ, మీ కిక్కడ ప్రవేశముంటుందనుకోడానికి కారణం?"

"నేను త్రాగుబోతును."

"ఆc! అందుకే ప్రవేశం లేదు."

ఆ మాటతో విరగబడి నవ్వాను. తనివిదీర నవ్వాను. ఆశ్రమవాసులు మేల్కొనే రీతిగా నవ్వాను. నవ్వుతుంటే బార్ మేనేజర్ మనస్సులో మెదిలాడు. పరంధామయ్యగారి పలుకులు మనస్సును పరామర్శించాయి. ఎక్కడ బార్ మేనేజర్? ఎక్కడ ఆశ్రమవాసి?—ఇరువురి మధ్య ఎంతదూరం?

'ఎందుకలా నవ్వుతున్నారు?' ఆశ్రమవాసి ప్రశ్నించాడు.

"నవ్వడంలేదు. ఏడుస్తున్నాను.... కాదు—మీ పరిస్థితిని చూసి ఏడవలేక నవ్వుతున్నాను. మీ ఆశ్రమంకంటే ఈ వూర్లో బార్లు నయం. ఆ బార్‌లో ఆనందం వుంది. అందులోవున్న మనుష్యుల్లో మానవత వుంది. మీ వద్ద ఏమీలేదు. అంతా నటన. కేవలం బూటకం. మీ అరవిందుడితో చెప్పండి. ఆంధ్రదేశం నుండి వచ్చిన కవి అజ్ఞగా చెప్పండి. హీనుల్ని, దీనుల్ని, పతితుల్ని, త్రాగుబోతుల్ని ఆదరించలేని ఆశ్రమాలు అపరదండుగ అని చెప్పండి. అసలు నాలాంటి దారితప్పిన వారిని సరియైన త్రోవలో నడిపించడం ఆశ్రమాలు చేయవలసిన పని. వాటి ప్రయోజనాన్ని అవి సాధించలేనపుడు వాటిని వెంటనే మూసివేయమని చెప్పండి." అంటూ బిగ్గరగా అరిచాను. లేనిశక్తిని కూడగట్టుకుని అరిచాను. అలా అరవడంలో వున్న ఆ కాస్తశక్తి హరించుకుపోయింది. ఎప్పుడో తిన్న అంత తిండి!.... అతిగా త్రాగిన తాగుడు—నిలద్రొక్కుకోలేక పడిపోయాను. కసినంతా కక్కేసి, సొమ్మసిల్లి పడిపోయాను. అంతవరకే నాకు తెలిసింది.

నాకు తెలివివచ్చి, పరిస్థితులు తెలిసివచ్చి, నేను కన్నులు విచ్చి చూచినపుడు నాకంట పడిందొక దివ్యమూర్తి. ఆ మూర్తి గంభీరంగా వుంది. విచ్చి వికసించినన అరవిందములా వుంది, ముఖారవిందము. ఆ కన్ను

లలో ప్రశాంతత తొణికిసలాడుతూ వుంది. నిర్మలంగా వెలుగుతున్న ఆ కన్నులలో నా రూపం నాకు కన్పడుతోంది. నా ఒంటిమీద బురద మరకల బట్టలులేవు. నా ఒడలు కడిగినట్లుంది. ముఖాన కుంకుమబొట్టు నిర్మలంగా వున్న కన్నుల్లో ప్రతిఫలిస్తోంది. ఆ మూర్తి కుడిచేయి ఆప్యాయంగా నా శరీరాన్ని నిమురుతూ వుంది. నా శరీరం గగుర్పొడిచింది. నా కన్నులు చెమర్చాయి. నా గుండె చెప్పుకోలేని అనుభూతిని పొందింది. నాకు తెలియకనే నా రెండుచేతులూ ఒక్కటై ఆ తేజోమూర్తికి నమస్కరించాయి!

మే, 1973, ఆంధ్ర సచిత్ర వారపత్రిక.